



# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఆగస్ట్ 12 2025 సంపుటి :0 సంచిక :297 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు.. ఇంటర్నల్ మార్కులపై విద్యాశాఖ నిర్ణయం



హైదరాబాద్: పాత పద్ధతిలోనే పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామని తెలంగాణ విద్యాశాఖ వెల్లడించింది. 20 శాతం ఇంటర్నల్ మార్కుల విధానం కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపింది. పదో తరగతి పరీక్షల్లో 80 శాతం ఎక్స్‌టర్నల్ మార్కులు, 20 శాతం ఇంటర్నల్ మార్కులు కేటాయించనున్నట్లు విద్యాశాఖ పేర్కొంది. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు.

మిగతాది 2లో

# ఎస్పీజీలో తొలి మహిళా ఆఫీసర్.. ఎవరీ అదాసో కపేసా?



- ఆమె మణిపూర్‌లోని సేనాపతి జిల్లాకు చెందినవారు.
- ఆమె సశస్త్ర సీమా బల లో ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు.
- ఆమె SPG (Special Protection Group)లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు.
- SPGలో చేరిన తొలి మహిళా అధికారిగా అదాసో కపేసా చరిత్ర సృష్టించారు.
- ఆమె ప్రధాని మోదీకి సెక్యూరిటీగా బ్రిటన్ పర్యటనలో ఉన్నారు.

దేశంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత పొందే ఏకైక వ్యక్తి ప్రధాని మోదీ. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ ఆయన్ను అనుక్షణం కంటికిరెప్పలా కాపాడుతుంది. ఇటీవల మోదీ బ్రిటన్ పర్యటనలో భాగంగా ఓ ఫొటో వైరలైంది. ప్రధాని వెనుకాల ఉన్న మహిళా ఎవరనే విషయం ఆసక్తిగా మారింది. ఆమె పేరు అదాసో కపేసా . ఎస్పీజీలో తొలి మహిళా ఆఫీసర్‌గా ఘనత సాధించారు. ఆమె గురించి కొన్ని విశేషాలివీ..!

**మేమే బాస్ అనుకునేవాళ్లకు భారత్ వృద్ధి నచ్చలేదు: రాజ్‌నాథ్ సింగ్**

మణిపుర్ సేనాపతి జిల్లాలోని కైబీ గ్రామం అదాసో కపేసా స్వస్థలం. సశస్త్ర సీమా బల్ లో చేరిన ఆమె.. ఉత్తరాఖండ్ పిథోడ్‌గఢ్‌లోని 55వ బెటాలియన్‌లో సేవలందించేవారు.

2లో

## దేశానికి సరిపడా ఆయిల్‌పామ్ పండించే శక్తి తెలంగాణ రైతులకు ఉంది: మంత్రి తుమ్మల



ఇంచర్ల: దేశానికి సరిపడా ఆయిల్‌పామ్ పండించే శక్తి తెలంగాణ రైతులకు ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అవకాశం కల్పిస్తే ఏదైనా సాధించే అన్నదాతలు ఇక్కడ ఉన్నారని చెప్పారు.

2లో

## సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గొలుసులు కొట్టేసి.. బెట్టింగ్‌లో పెట్టి..



2లో

# సివిల్స్ ప్రిపేర్ అవుతున్న వారికి అండ

### రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం ద్వారా సాయం మెయిన్స్‌కు ఎంపికైన వారికి లక్ష చెక్కు అందించిన భట్టి



సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి ఎంతో కొంత సాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద సివిల్స్-2025లో మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష చెక్కులను మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా అభ్యర్థులకు సాయం అందిస్తామన్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా రెండో సంవత్సరం అమలుచేస్తున్నామన్నారు. సివిల్స్ అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా సాయం అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు.ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదని, సమాజానికి అందించే ఓ బాధ్యత అనిభట్టి విక్రమార్క అన్నారు.

2లో

# రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును కొట్టేసిన హైకోర్టు



హైదరాబాద్: రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. 2019 అక్టోబర్‌లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పీఎస్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన ఈ కేసును కొట్టేయాలని రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మిగతాది 2లో

## హైదరాబాద్‌లో మళ్లీ వర్షం.. వాహనదారుల ఇక్కట్లు




హైదరాబాద్: నగరంలో మళ్లీ వర్షం కురుస్తోంది. కూకట్‌పల్లి, జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్, దుండిగల్, సనత్‌నగర్, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బోయిన్‌పల్లి, అల్వాల్, ప్యాట్నీ, చిలకలగూడ, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం పడుతోంది. పలుచోట్ల వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయింది. కార్యాలయాల నుంచి ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో కొన్నిచోట్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## రాష్ట్ర ముఖ్య నేతలు అవమానిస్తున్నారు: రాజగోపాల్‌రెడ్డి



2లో


## ఓట్లు వేయించుకొని.. సీట్లు వచ్చాక తప్పించుకోవడం ఓట్ల చోరీ కాదా?: కేటీఆర్



2లో

# సంపాదకీయం

## అసలేమిటీ స్వచ్ఛమైన కవిత్వం



శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కన్నా ఆయన తొలి కవిత్వ సంపుటి 'ప్రభవ' లోనే కవిత్వం ఎక్కువనీ, మయకోవ్‌స్కీ కమ్యూనిస్టు కాకముందు గొప్ప కవిత్వం రాశాడనీ ఇస్మాయిల్ అన్నట్టు, ఇప్పుడు కూడా రాజకీయ భావజాలాలతో కవిత్వం రాస్తే, అందులో కవిత్వస్థాయి తగ్గుతుందనే అభిప్రాయం మారినట్లు లేదు. అంటే భావ కవిత్వమే నిజమైన కవిత్వమనుకోవాలా? భావకవిత్వం గురించే ఎందుకు అడుగుతున్నాను అంటే, ఈ కవిత్వాన్ని మాత్రమే కవిత్వం అనుకునే అభిప్రాయాలు ఉన్నాయి, ఈ కవిత్వం వైపు నుంచే రాజకీయ%-సామాజిక కవిత్వ స్థాయిని అంచనా కట్టడం చూస్తూ ఉన్నాను.

సాధారణంగా రాజకీయ-సామాజిక కవిత్వం రాస్తున్నవాళ్ళు భావ కవిత్వం రాసేవాళ్ళని కవులుగా వారి తీరుని ఒప్పుకోరు గానీ వారి కవిత్వాన్ని శంకించిన దాఖలాలు తక్కువ. కానీ రాజకీయ -సామాజిక కవుల తీరుని ఒప్పుకొనే భావకవులు, వారి కవిత్వాన్ని మాత్రం శంకిస్తారు.

ఇదో భిన్నమైన అభిప్రాయాల మిశ్రమం. అయితే ఇవి రెండు శిబిరాల నుంచి వెల్లువెత్తుతున్న, అవతలి వారిని దెబ్బ కొట్టడానికి వాడే అభిప్రాయాలు మాత్రమే కాదు. ఇవి ఒక శతాబ్దకాలంగా ఈ రెండు రకాల కవులకు పరస్పరం ఏర్పడిన నిశ్చిత అభిప్రాయాలు. ఈ భిన్నాభిప్రాయాల వలన ఒకరి మీద ఒకరికి సరైన గౌరవమైనా ఉంటుందా అని ఒక అనుమానం. ఇక్కడ 'ఒకరి మీద ఒకరికి' అంటే దాని అర్థం వారి వారి కవిత్వాల విషయంలో అన్నది ప్రత్యేకించి చెప్పుకోవాల్సిన పని లేదు.అయితే మరి ఈ రెండు అభిప్రాయాల ప్రాతిపదికగా దేన్ని స్వచ్ఛమైన కవిత్వం అనగలం? కవిత్వం అంటే ఏమిటి అని ఆలోచిస్తే- అది కేవలం అలంకారప్రాయమైన పదాల సమాహారం కాదనేది స్పష్టం. ఒక వాక్యం నీలో తాజాదనాన్ని కలిగిస్తుందా లేదా అనేది ముఖ్యమే. ఉపమలను మాత్రమే కవిత్వం అనుకొనే రోజుల్ని కవిత్వం ఎప్పుడో దాటి వచ్చింది. భావాన్ని గాఢంగా, మూస వాక్యాల నిర్మాణంలో చెప్పకపోవడం అనుభూతి కలిగించవచ్చు. అయితే తాజా వాక్యాల సమాహారం కూడా కవిత్వం కాదు. 20వ శతాబ్దం కవిత్వానికీ 21వ శతాబ్దం కవిత్వానికీ మధ్య చాలా మార్పు ఉంది. వ్యక్తీకరణ, దాని స్వరూపం మారింది. అప్పటి బైరాగి కవిత్వానికి, ఇప్పుడు నరేష్కుమార్ సూఫీ కవిత్వానికి చాలా మార్పు ఉంది. అలాగే అప్పటి రాయప్రోలు కవిత్వానికి, ఇప్పటి మానస చామర్తి కవిత్వానికి చాలా మార్పు ఉంది. అయితే ఈ కవిత్వాల్లో పట్టాలు¯(తీుఎెఎం) ఎక్కువ మారలేదు. బైరాగి మానవుని ఏకాంతలోతుల్ని, ఆధునిక రాజకీయ స్మరణని కలిపి రాశాడు. కానీ తర్వాత అది రెండు మార్పుల్ని సంతరించుకుంది. రాజకీయ కవిత్వంగా, మానవుని ఏకాంత కవిత్వంగా రెండు భాగాలుగా విడివడింది. అయితే రాజకీయ కవిత్వం మానవుడి గురించి మాత్రమే చెప్పే కవిత్వాన్ని ఒప్పుకోదు. మానవుడి ఒంటరితనాన్ని చెప్పే కవిత్వాన్ని, భావ కవిత్వాన్ని ఒకే గాటన కడుతుంది. అందువల్ల ఈ ఒంటరితనం కవిత్వం రాజకీయ-సామాజిక కవిత్వానికి దూరంగా జరిగి, భావకవిత్వానికి దగ్గరగా అంటే ఒక నైబర్‌గా వచ్చి చేరింది.అయితే భావకవిత్వానికి పాయలు లేకపోలేదు. అప్పటి బసవరాజు అప్పారావు దగ్గర నుంచి ఇప్పటి నందకిశోర్ వరకూ వీళ్లు ప్రేమ కవిత్వం రాసినా ఇది పదకవిత్వంగా ఒక ప్రత్యేక పాయగా ప్రాచుర్యం పొందింది. భావకవులకు ఉన్నంత గుర్తింపు ఈ పద కవులకు ఉన్నా, కవిత్వ ప్రాచుర్యం పరంగా భావకవిత్వమే ఒక అడుగు ముందు ఉంది.రాజకీయ-సామాజిక కవిత్వం తర్వాతి రోజుల్లో కొన్ని మార్పులను అందుకుంది. అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో నోస్టాల్జియా కవిత్వం వచ్చింది. అణచివేతకు గురైన కులాల నుంచి ఇంటి, ఊరి, కుల స్పృహతో వచ్చిన ఈ సాహిత్యం రాజకీయ-సామాజిక కవిత్వంగా నిలిచింది. ఇదే సందర్భంలో అగ్రకులాల నుంచి వచ్చిన నోస్టాల్జియా కవిత్వం మాత్రం కేవలం నోస్టాల్జియాలా మిగిలిపోయింది. అయితే రాజకీయ-సామాజిక కవిత్వపరంగా రెండు ముఖ్యమైన శిబిరాలుగా మారింది అభ్యుదయ, అస్తిత్వ సాహిత్యాలే. ఇందులో రాజకీయ-సామాజిక కవిత్వం, అస్తిత్వవాద సాహిత్యాన్ని నోస్టాల్జియా పరిధిని దాటి విశాలమైన ప్రాపంచిక దృక్పథంతో రాయమని కోరుతూ ఉంటుంది. ఇది మార్క్స్, అంబేడ్కర్ చట్రంలోంచి మాత్రమే చూడటం వలన వచ్చిన పొరపాటు. రాజకీయ కవులు అనగానే కులాన్ని వర్గంగా చూసేవారో, లేదా కుల వివక్ష గురించి మాత్రమే రాసేవారో మాత్రమే కాదు. ఇక్కడ ఏది రాజకీయ కవిత్వమో నిర్ణయించేది సమాజం కులంతో నిర్మితమైనదా లేక వర్గంతో నిర్మితమైనదా అన్న చర్చ కాదు. రాజ్యానికి వ్యతిరేకమైన గొంతు వినిపించేది రాజకీయ కవిత్వం అనేది స్పష్టం.భావ కవిత్వం గురించీ, రాజకీయ-సామాజిక కవిత్వం గురించీ ఆలోచించినప్పుడు భావకవిత్వం సాధించిన శైలీగాఢతను రాజకీయ కవిత్వం సాధించ లేకపోయిందనీ, అలాగే రాజకీయ-సామాజిక కవిత్వం సాధించిన వస్తువైవిధ్యాన్ని భావకవిత్వం సాధించలేకపో యిందనీ అర్థమవుతుంది. దీనికి రెండు కారణాలు అనుకోవచ్చు. భావ కవికి పరిమితమైన వనరులు మాత్రమే ఉన్నాయి. నదీ, చెట్టూ, పుట్టా, పూలూ, ప్రేయసీ, ఆకాశమూ, చీకటి ఇవి మాత్రమే. ఇందులో ప్రధానంగా ప్రేమ, విరహం, ప్రేమరాహిత్యం, శృంగారం వస్తువులుగా ఉంటుంటాయి. కానీ రాజకీయ-సామాజిక కవి అలా కాదు. దేశంలో, విదేశంలో జరుగుతున్న రాజకీయ చదరంగంలో పావుల కదలికల్ని చూడాలి. అవి సమాజం మీద చూపే ప్రభావాల గురించి ఆలోచించాలి. సమాజంలో ఉన్న పీడన, హింస, దోపిడీ వాటి మార్పు ఇవన్నీ ఉన్నాయి.

రాజకీయ-సామాజిక కవి తనని తప్ప లోకాన్నంతా కవిత్వం చేస్తే, భావకవి లోకాన్ని తప్ప తనని మాత్రమే కవిత్వం చేసుకుంటాడు. ఇందులో భావకవి శైలి విషయంలో చూపగలిగిన శ్రద్ధ రాజకీయ కవికి కుదరదు. తనకి ఆవేశం ముఖ్యం. భావకవిలా సున్నితంగా ప్రతి పదాన్ని ఖచ్చితంగా వాడేంత వీలు ఉండదు. అయితే ఏదో ఒక సామాజిక అంశాన్ని తీసుకొని రాసినంత మాత్రాన అది ఉత్తమ కవిత్వంగా మిగిలిపోదు. రాజకీయ సామాజిక కవిత్వంలో కవిత్వపాళ్ళు తక్కువనే అభిప్రాయాలు ఏర్పడటానికి కొన్ని మూస పదాలని, పోలికల్ని ఎక్కువగా వాడుతూ ఉండటమే కారణం కావొచ్చు. అభ్యుదయ కవిత్వం మొదలై కొనసాగిన కాలంలో కానీ, అస్తిత్వ ఉద్యమ కవిత్వం మొదలై కొనసాగుతున్న కాలంలో కానీ ఒక మూస ఫార్ములాలతో కవిత్వం వెల్లువెత్తటం వల్ల కూడా రాజకీయ సామాజిక కవిత్వం మీద అందులో కవిత్వపాళ్లు తక్కువ అనే అపవాదు స్థిరపడి ఉంటుంది. రాజకీయ-సామాజిక కవిత్వం రాసినంత మాత్రాన అందులో కవిత్వస్థాయి తక్కువ ఉంటుందనుకోవటం పొరపాటే. అయితే భావకవిత్వం లోని గాఢత, రాజకీయ-సామాజిక కవిత్వం లోని గాఢత రెండూ ఒకటి కాదు. రెండూ భిన్నమైన అనుభూతులు. శ్రీశ్రీ 'దేశ చరిత్రలు', కృష్ణశాస్త్రి 'స్వేచ్ఛా విహారం' కవితలు ఒకేరకమైన అనుభూతిని ఇవ్వవు. కవిత్వం అనగానే ఏకపక్ష అనుభవమే ఉంటుంది అనుకోవటం వలన వచ్చే సమస్యలు కావచ్చు ఇవన్నీ.అయితే అసలైన కవిత్వం ఏమిటి? అనే ప్రశ్నను మళ్లీ వేసుకుంటే భావకవి గాఢమైన శైలా? రాజకీయ-సామాజిక కవి వైవిధ్యమైన వస్తువా? అనే రెండు ప్రశ్నలు ముందుకు వస్తాయి. ఈ రెండూ కలిసినది స్వచ్ఛమైన కవిత్వం అని తెలివిగా బదులు చెప్పుకోవచ్చు కానీ, తన తాజా పదాలను, గాఢమైన శైలిని చూసుకొని నేనే అచ్చమైన కవిని అని ఉబ్బిపోయే భావకవి, రాజకీయ- సామాజిక కవిత్వం రాసి లోకానికి ఎంతో మేలు చేస్తున్నా అని బీరాలు పలికే రాజకీయ కవి... ఈ రెండు వర్గాల మధ్య కవిత్వం గురించి స్థిరమైన వ్యతిరేక అభిప్రాయాలు ఉన్నంతకాలం, మళ్లీ మళ్లీ కవిత్వాన్ని అర్థం చేసుకోవటానికి, మనం కవిత్వమంటే ఏమిటి అనే ప్రశ్న వేసుకోవాల్సిందే.

# సివిల్స్ ప్రిపేర్ అవుతున్న వారికి అండ

మొదటిపేజీ తరువాయి

మానవ వనరులు అత్యంత బలమైన పెట్టుబడి అని, మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగపడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. గతేడాది అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారని, 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలన్నారు. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుందని పేర్కొన్నారు. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని డిప్యూటీ- సీఎం భట్టి సూచించారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం జరిగింది. మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగ పడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకు ఎంతో కొంత సాయం అందించాలని మేం ప్రయత్నం చేస్తున్నాం. మొత్తం సాయం కాకపోయినా.. కొంత మీకు అండగా ఉండాలని అభయ హస్తం ఇస్తున్నాం. మెయిన్స్‌కు వెళ్తున్న వారికి లక్ష సాయం చేస్తున్నాం, కొంత కొచింగ్‌కి ఉపయోగ పడుతుందని ప్రభుత్వ ఆలోచన. లాస్ట్ ఇయర్ అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారు. 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలి. సివిల్ సర్వెంట్‌ల సమావేశాల్లో కొందరు ఐఏఎస్‌లను రోల్ మోడల్‌గా చెప్తారు. మాధవరావు, ఎస్ఆర్ శంకరన్ లాంటి వాళ్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటాం. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుంది. ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదు.. సమాజానికి అందించే బాధ్యత. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టు-కోవాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు సక్సెస్ అవుతాయి. మాకు ఎంత చేయాలి అని ఉన్నా.. ఐఏఎస్‌లలో నిబద్ధత లేకుంటే లక్ష్యం చేరుకోలేం. శంకరన్ లాంటి వాళ్లు సంక్షేమ శాఖల్లో పని చేశారు. మిషన్ లాగ పని చేస్తే.. ప్రజలు కూడా మిషన్ లాగే మర్చిపోతారు. సవాళ్లను అధిగమించి లక్ష్యం సాధించండని డిప్యూటీ- సీఎం భట్టి సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి.. ఇవాళ సివిల్స్‌కి వెళ్లే వారి వరకు అందరికీ ప్రభుత్వం సహకారం అందిస్తున్నాం. 55 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణ కి ఇప్పటికే టెండర్లు పిలిచాము. రైతు కొడుకు రైతే అవుతున్నాడు. మేము ఐదేళ్లు.. పదేళ్లు పదవుల్లో ఉంటాం. సివిల్స్ సాధించి మీరు ప్రజల సేవలో ఉండండి. కాన్ఫిడెన్స్‌తో సివిల్స్ ప్రిపేర్ అవ్వాలి. డిల్లీలో నా క్వార్టర్స్‌ను చదువుకునే వారికే ఇచ్చా. నా క్వార్టర్స్‌లో ఉండి చదువుకున్న ఇద్దరు ఇప్పుడు నా జిల్లాలోనే సర్వీసులో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

## పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు..
### ఇంటర్నల్ మార్కులపై విద్యాశాఖ నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులు ఉన్నాయా? లేవా? అనే అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూశారు. ఇంటర్నల్ మార్కులను తొలగిస్తూ గత ఏడాది నవంబరులో ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే, ఇటీవల దిల్లీలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఈ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తడంతో పునరాలోచనలో పడిన పాఠశాల విద్యాశాఖ అధికారులు.. పాత విధానాన్నే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గొలుసులు కొట్టేసి.. బెట్టింగ్‌లో పెట్టి..

మొదటిపేజీ తరువాయి

రెజిమెంటల్ బజార్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లో గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న లవరాజు అనే వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.7,70,000 విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఈ కేసు వివరాలను సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావెద్ మీడియాకు వివరించారు.

"ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా శంఖవరం మండలం జగ్గంపేటకు చెందిన కోరుప్రోలు లవరాజు (23) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పరిధి సూరారంలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యం, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస అయ్యాడు. వీటన్నింటికీ తనకు వచ్చే జీతం సరిపోకపోవడంతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. రద్దీగా ఉన్న రైళ్లను ఎంపిక చేసుకుని మహిళల మెడలో బంగారు గొలుసులు దొంగిలించడం మొదలుపెట్టాడు. తద్వారా వచ్చిన డబ్బును బెట్టింగ్‌లో పెట్టాడు.

ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 26న సింహపురి ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 2న గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో బంగారు గొలుసులు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదులతో రైల్వే ఎస్పీ చందనాదీప్తి ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, ఎస్సై సుబ్బారెడ్డి, ఆర్పీఎఫ్‌తో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు" అని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

## ఎస్పీజీలో తొలి మహిళా ఆఫీసర్..
# ఎవరీ అదాసో కపేసా?

మొదటిపేజీ తరువాయి

ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిణి అయిన ఆమె ఎస్పీజీలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులోకి ప్రవేశించడం ఆషామాషీ వ్యవహారం కాదు.

యుద్ధ మెలకువలు, వ్యూహాత్మక నిఘా, హై సెక్యూరిటీ ప్రొటోకాల్ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే తీరు అంశాల్లో కచ్చితత్వం కనబర్చిన కపేసా ఇందులో అడుగుపెట్టారు.కఠినమైన ప్రమాణాలతో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన భద్రతాదళాల్లో ఒకటిగా పేరుపొందిన ఎస్పీజీ (%ఛ్రా+%) బృందంలో కపేసా ప్రవేశించడం వ్యూహాత్మకం, చరిత్రాత్మకంగానూ భావిస్తున్నారు. ముఖ్యంగా భద్రతా బలగాల్లో స్త్రీ, పురుష భేదం లేదని నిరూపించే ప్రయత్నం చేశారు.

1985లో ఎస్పీజీ ఏర్పాటైనప్పటి నుంచి ఓ మహిళా అధికారిణి ఇందులో విధులు నిర్వర్తించడం ఇదే తొలిసారి కావడం విశేషం.ప్రధాని బ్రిటన్ పర్యటనలో కపేసా విధుల్లో ఉండటంతో ఆమెపై సోషల్ మీడియాలో ప్రశంసలు కురిశాయి. ఆమె సరికొత్త ఘనత సాధించారని, శక్తికి ప్రతిరూపంగా, ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారంటూ నెటిజన్లు స్పందించారు.

## కారేపల్లిలో గంటకుపైగా నిలిచిన కాకతీయ ఎక్స్‌ప్రెస్

కారేపల్లి: కొత్తగూడెం నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు ఖమ్మం జిల్లాలోని కారేపల్లిలో గంటకుపైగా నిలిచిపోయింది. క్యాబిన్ సమీపంలో కోతుల గుంపులు రైలుకు సరఫరా అందించే విద్యుత్ తీగలకు తగలడంతో ఓ తీగ తెగిపోయింది. సమాచారం అందుకున్న రైల్వే శాఖ అధికారులు కారేపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపారు.



దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సిబ్బంది సుమారు గంటకుపైగా శ్రమించి మరమ్మతులు చేయడంతో రైలు తిరిగి ఉదయం 8 గంటలకు బయలుదేరింది.

## దేశానికి సరిపడా ఆయిల్‌పామ్ పండించే శక్తి తెలంగాణ రైతులకు ఉంది: మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి

మంత్రి సీతక్కతో కలిసి ములుగు జిల్లాలోని ఇంచర్లలో ఆయిల్‌పామ్ ప్రరిశ్రమకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ ఆయిల్‌పామ్, ఇతర హార్టికల్చర్ పంటలు వేయాలని సూచించారు. భవిష్యత్తులో అన్ని జిల్లాల్లో ఆయిల్‌పామ్ వేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ నెలాఖరుకు గానీ, సెప్టెంబర్ నెల మొదటి వారంలో గానీ సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ప్రభుత్వం తరఫున పెద్ద ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

" రాబోయే 4 సంవత్సరాల్లో అన్ని జిల్లాలకు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు వస్తాయి. తద్వారా రైతులు ఇంకా 10 నుంచి 15 లక్షల ఎకరాలు పంట వేయాల్సిన అవసరం ఉంది. పంట మీ దగ్గరికే వచ్చి తీసుకెళ్తారు. వారం రోజుల్లో నగదు ఖాతాలో జమ అవుతుంది. ప్రభుత్వమే ధర ఫిక్స్ చేస్తుంది. ఈ పంటలో పురుగు మందులు వేయాల్సిన అవసరం లేదు. ఆయిల్‌పామ్‌లో లాభాలు సాధించే రైతులకు ప్రతిఒక్కరికీ కారు ఉంటుంది. వ్యవసాయం చేయడం వల్ల వచ్చే సంపాదన చూస్తే ఆనందం కలుగుతుంది. మరే ఇతర వాటిలో ఇది దక్కదు" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

## రాష్ట్ర ముఖ్య నేతలు
### అవమానిస్తున్నారు: రాజగోపాల్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని, ఇది వాస్తవమని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అయితే ఆ హామీని అధిష్ఠానం అమలుచేయలేదని వాపోయారు. ఈ విషయంలో తనను రాష్ట్రంలోని ముఖ్య నేతలే అడ్డుకుంటూ అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇందులో వాస్తవాన్ని ప్రజలకు వివరించిన భట్టి విక్రమార్కకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని, ప్రభుత్వం అవినీతిరహిత పాలనను అందించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నానన్నారు. తెలంగాణ సమాజం ఆకాంక్షలు నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని ఆకాంక్షించారు.


## ఓట్లు వేయించుకొని.. సీట్లు వచ్చాక తప్పించుకోవడం ఓట్ల చోరీ కాదా?: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన 'ఓట్ల చోరీ' ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రస్తావిస్తూ ఆయన పోస్ట్ చేశారు. "ఎన్నికల మేనిఫెస్టోలో 420 వాగ్దానాలు చేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని స్టాంపు పేపర్లపై రాసిచ్చారు. వంద రోజుల్లో పథకాలు అమలు చేస్తామని ప్రకటించారు. ఓట్లు వేయించుకొని.. సీట్లు వచ్చాక తప్పించుకోవడం ఓట్ల చోరీ కాదా?" అని రాహుల్‌ను కేటీఆర్ ప్రశ్నించారు.

# రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును కొట్టేసిన హైకోర్టు

మొదటిపేజీ తరువాయి



**రేవంత్‌రెడ్డిపై కేసు దాఖలు చేసిన పిటిషనర్‌కు సుప్రీం అక్షింతలు**

రేవంత్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దాఖలు చేసిన పిటిషనర్ పెద్దిరాజుకు సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు అఫిడవిట్ రూపంలో క్షమాపణలు చెప్పాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఆదేశించింది. రేవంత్‌రెడ్డిపై పెద్దిరాజు దాఖలు చేసిన కేసును గతంలో తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఆ కేసును నాగ్‌పుర్ బెంచ్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో పెద్దిరాజు ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. పిటిషన్ డ్రాఫ్ట్ చేసిన ఏఓఆర్, పెద్దిరాజుపై సీజేఐ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు క్షమాపణలు చెప్పాలని తెలిపింది. క్షమాపణ చెపుతూ దాఖలు చేసే అఫిడవిట్‌పై నిర్ణయాన్ని జస్టిస్ మౌసమి భట్టాచార్యకు వదిలేసింది. వారం రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని పెద్దిరాజుకు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఆగస్ట్ 12 2025

# "వాహనాలు విస్తృతంగా తనిఖీలు



**గజ్వేల్ ఆగస్ట్ 11,కరపత్రం ప్రతినిధి**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ సోమవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు సిద్దిపేట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ ఆదేశానుసారం మేరకు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ పోలీసుల సిబ్బందితో కలిసి విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేస్తూ డ్రైవింగ్ లైసెన్, ఇన్సూరెన్స్, ఆర్సి, హెల్మెట్ చెకింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు వాహనదారులలో ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతుందని దాన్ని దృష్టిలో ఉంచుకొని సేఫ్టీ సెక్యూరిటీగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. త్రిబుల్ రైడింగ్ పై ప్రతిరోజు నిర్వహిస్తామని తెలిపారు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు ఈ తనిఖీల్లో గజ్వేల్ ఏ ఎస్ ఐ జగదీశ్వర్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణిలో స్మశానవాటికల సమస్యలపై ఫిర్యాదు

**– సూరారం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ చర్యలకు డిమాండ్**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11కరపత్రం ప్రతినిధి**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ పరిధిలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో, 129 సూరారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ కళావతి నగర్ హిందూ స్మశానవాటిక, మార్కండేయ నగర్ ముస్లిం స్మశానవాటికల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులపై ఫిర్యాదు సమర్పించారు. డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి కి దరఖాస్తు అందజేసిన అనంతరం, పుప్పాల భాస్కర్ డిప్యూటీ ఇంజనీర్ విశాలాక్షి ని కలిసి స్మశానవాటికల్లో వసతుల కొరత వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. తక్షణమే అవసరమైన వసతులు కల్పించి, పెండింగ్ పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డి ఈ స్మశానవాటికలను పరిశీలించి, అవసరమైన వసతులు ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముకుందరావు తదితరులు పాల్గొన్నారు...

# మహాధర్నా బయలుదేరిన తెలంగాణ ఉద్యమకారులు



**(కరపత్రం ప్రతినిధి ప్రతినిధి వరంగల్)**
ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వేయి స్తంభాల గుడి నుండి మహాధర్నా ప్రారంభి ప్రొఫెసర్ జయశంకర్ ఏకశిలా పార్క్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కడి సంజీవరెడ్డి మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమకారులకు అదేవిధంగా అమరవీరుల కుటుంబాలకు గత ప్రభుత్వము విస్మరించినది వాస్తవం అదేవిధంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ ధర్నా ముఖ్య ఉద్దేశం అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి అన్ని హామీలు నెరవేర్చినట్లు కూడా ఉద్యమకారుల హామీలను కూడా స్థానిక సంస్థల లోపే అమలు చేయాలని కోరడమైనది లేనట్లయితే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమకారులు స్థానిక సంస్థలలో పోటీ చేసి పోటీ చేయడానికి రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకోవడం జరిగిందని అదేవిధంగా ఉద్యమకారులు పోటీ చేసిన స్థానాలలో అభ్యర్థులకు అభ్యర్థులకు జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీ ఇంటికొక రూపాయలు ఇంటికొక రూపాయి విజయానికి అభ్యర్థుల విజయానికి ఉద్యమకారుల ఫోరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరే రమేష్ రెడ్డి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి
నర్రా భూమి రెడ్డి మండల వర్కింగ్ ప్రెసిడెంట్
లాల్ మహ్మద్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు
మండల ప్రధాన కార్యదర్శి గురుకుల రాజీ రూ
గుడికందుల రాజయ్య , మండల అధ్యక్షులు రాజబాబు ఆరెల్లి అశోక్ ప్రచార కార్యదర్శి నన్నే బోయిన రవి యాదవ్ నాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# బిసి కథనభేరి ఏర్పాట్ల పరిశీలన



**(కరపత్రం ప్రతినిధి ప్రతినిధి కరీంనగర్)**
కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే బిసి కథనభేరి ఏర్పాట్లను సోమవారం మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 14న బీసీ కరణభీరిని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కథను బేరికి కేటీఆర్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మంత్రులు నాయకులు ఢిల్లీలో ఏం చేశారని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్ సాధించేవరకు జిల్లాల వారీగా రాష్ట్రవ్యాప్తంగా బీసీ కథన బేరి లను నిర్వహించినట్లు చెప్పారు. ఇక్కడ నాయకులతో పాటు తదితరులు ఉన్నారు.

# కుత్బుల్లాపూర్ జర్నలిస్ట్ టి. రమేష్‌కు "బెస్ట్ జర్నలిస్ట్" అవార్డు







**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11 కరపత్రం ప్రతినిధి**
హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నేషనల్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా అందించే ప్రతిభా పురస్కారాలలో, సోషల్ సర్వీస్ విభాగంలో ఈసారి బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు కుత్బుల్లాపూర్ జర్నలిస్ట్ టి. రమేష్‌కు లభించింది. ఆదివారం రవీంద్ర భారతిలో జరిగిన ఘనమైన వేడుకలో మానేపల్లి జ్యువెలర్స్ అధినేత, స్వర్ణగిరి దేవాలయం వ్యవస్థాపకుడు మానేపల్లి రామారావు, తెలంగాణ ఆర్య వైశ్య ఫెడరేషన్ ఛైర్మన్ కల్వ సుజాత తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు టి. రమేష్‌కు అవార్డును ప్రదానం చేశారు. గత 30 ఏళ్లుగా జర్నలిస్టుగా పని చేస్తూ ప్రజా సమస్యలు, జర్నలిస్టుల సమస్యలపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన రమేష్, నాటి ఉమ్మడి నల్లగొండ (ప్రస్తుతం యాదాద్రి) జిల్లాలో వార్త, ఆంధ్రజ్యోతి పత్రికల్లో సేవలందించారు. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. టి. రమేష్ ఈ అవార్డు అందుకోవడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, సుభాష్ నగర్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, జీడీమెట్ల సి.ఐ. జి. మల్లేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు...

# జగద్గిరిగుట్ట హత్యాయత్నం కేసు మళ్లీ విచారణకు డిమాండ్

**– ఏసీపీపై నిందితుడి సంచలన ఆరోపణలు – అసలు కుట్రదారులను బయటపెట్టాలంటూ విజ్ఞప్తి**






**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11 కరపత్రం ప్రతినిధి**
జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో 2017లో నమోదుట్కన హత్యాయత్నం కేసును (క్రైమ్ నం. 138/2017) మళ్లీ తెరచి, పూరక చార్జిషీట్ దాఖలు చేయాలని నిందితుడు హనుమండ్ల బాలరాజు ఉన్నతాధికారులను కోరారు. ఈ కేసులో తాను ఆర్టీఐ కార్యకర్త వాకిటి మాధు బాబు మీద దాడి చేసినట్లు ఒప్పుకున్నప్పటికీ, దీని వెనుక ఉన్న ప్రేరేపకులు, ఆర్థిక సహకారం అందించినవారు ఇప్పటికీ న్యాయస్థానం ముందు నిలబడలేదని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా బాలరాజు సోమవారం ఒక వీడియోను విడుదల చేశారు. తనను కాంగ్రెస్ నేత మొహమ్మద్ రషీద్, కుత్బుల్లాపూర్ మండల ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రవుల శేషగిరి అత్యాయత్నం చేయమని ప్రేరేపించారని తెలిపారు. హత్యాయత్నం కోసం నిధులు కూడా సమకూర్చారని అన్నారు. ఈ కుట్రలో 150కి పైగా ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్స్ కూడా పరోక్షంగా ప్రమేయం ఉన్నారని ఆయన వెల్లడించారు. తన వద్ద ఉన్న వీడియో, ఆడియో రికార్డులు, ఆధారాలు అప్పటి బాలనగర్ డివిజన్ ఏసీపీ గోవర్ధన్‌కు అందజేసినా, ఆయన వాటిని ఉపయోగించకుండా, సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాల్లను బెదిరించి, సుమారు కోటి రూపాయల లంచం తీసుకుని సాక్ష్యాలు నాశనం చేశారని బాలరాజు ఆరోపించారు. తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, అందువల్ల రక్షణ కల్పించడంతో పాటు, అసలు కుట్రదారులపై కఠిన చర్యలు తీసుకునేలా మళ్లీ పూర్తి స్థాయి విచారణ జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు...

# ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ముందంజ



**– శ్రీ హెూమ్స్ కాలనీలో సిసి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన రూ.20 లక్షల నిధులు మంజూరు**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11 కరపత్రం ప్రతినిధి**
ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రతినిత్యం కృషి చేస్తుందని మరోసారి నిరూపితమైంది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని శ్రీ హెూమ్స్ కాలనీ 1A, 2B సీసీ రోడ్లు పూర్తిగా పాడై, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసుల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, కార్పొరేషన్ ఫండ్స్ నుంచి రూ.20 లక్షలు మంజూరు చేయించి సీసీ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ం ప్రజలు ఎక్కడ సమస్యలు చెప్పినా, వాటిని వెంటనే పరిష్కరించడమే మా కర్తవ్యం. అభివృద్ధి పనుల్లో కాంగ్రెస్ ఎల్లప్పుడూ ముందుంటుంది అని పేర్కొన్నారు. కాలనీ వాసులు హన్మంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణ రెడ్డి, 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, గోంగుల జిత్తు, 18వ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, రాజేందర్, అంజయ్య గౌడ్, విజయతో పాటు అనేక మంది కాలనీ వాసులు పాల్గొన్నారు...



# మున్నూరు కాపులందరూ ఐక్యమత్యంతో ఉండాలి

**– మున్నూరు కాపు సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు ఏ బూసి శ్రీనివాస్**

**(కరపత్రం ప్రతినిధి జమ్మికుంట)**
మున్నూరు కాపు సోదరులందరూ ఏకతాటి పైకి వచ్చి ఐకమత్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోవచ్చునని మున్నూరు కాపు సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు ఏ బూసి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘ నాయకులు ఏ బూసి శ్రీనివాస్ ను శాలువాతో ఘన సన్మానము చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్నూరు కాపు కులస్తులను సంఘటితపరిచి ,వారి ఐక్యత కొరకు పాటుపడతానన్నారు. కుల ఐక్యత అనేది చారిత్రక ,సామాజిక ,రాజకీయ పరంగా చాలా ముఖ్యమైన అంశమని అన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నగంటి కుమార్, సల్ల రవి, ఏ బూసి అజయ్ కుమార్, సల్ల శ్రీనివాస్, ఏ బూసి మహేందర్, ఏ బూసి అన్వేష్, సల్ల మహేష్, ఏ బూసి అభిలాష్, సల్ల శ్రావణ్ కుమార్, ఏ బూసి వినయ్ కుమార్, ఏ బూసి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ





**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జమ్మికుంట)**
జమ్మికుంట మండలం పరిధిలో ని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జమ్మికుంట మున్సిపల్ తో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో నులిపురుగుల నిర్మూలన మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు
ఆల్బెండజోల్ 44 ప్రభుత్వ పాఠశాలలు, 56 అంగన్వాడీ కేంద్రాలు,17 ప్రైవేట్ పాఠశాలలు,4ప్రభుత్వ జూనియర్ కళాశాలలు,3 ప్రైవేటు జూనియర్ కళాశాలలు,1 ప్రభుత్వ డిగ్రీ కళాశాల,2 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో పిల్లలకు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వేశారు. అంతకముందు ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో డాక్టర్ చందు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ హుజరాబాద్ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి లాంచనంగా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ... ఆల్బెండజోల్ వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి పిల్లలకు వివరించారు. మాత్రలు వేసుకోకుండా ఉన్న పిల్లలకు ఈనెల 18 వ తేదీ వేయడం జరుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేష్, డాక్టర్ చందన, డాక్టర్ ఫర్హానుద్దీన్, డాక్టర్ బిందు, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ సంధ్య,హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్ గౌడ్,అడిదెలమోహన్ రెడ్డి, సూపర్వైజర్స్ రత్నకుమారి,అరుణ, కుసుమ కుమారి సదానందం మరియు వైద్య సిబ్బంది,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

